ఈనాడు
తూర్పుగోదావరి
శనివారం అక్టోబరు 19, 2024

తిరువీధుల్లో శ్రీనివాసుడి విహారం


రథాన్ని లాగుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. చల్లని వాతావరణంలో విద్యుద్దీప కాంతులు ప్రకాశిస్తుండగా భక్తుల గోవింద నామస్మరణలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ క్షేత్ర తిరువీధుల్లో స్వామివారి రథ యాత్ర కనులపండువగా సాగింది. తొలుత రథాన్ని పలు రకాల పుష్పాలు, రంగు రంగుల విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.


రాజమన్నార్‌గా..

రాజమన్నార్ అలంకారంలో దర్శనం..

కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారు శుక్రవారం రాజమన్నార్ అలంకారంలో దర్శనమిచ్చారు.

కల్యాణమహోత్సవాల్లో ఈనాడు

● ఉదయం 10.30 గంటలకు చక్రస్నానం, రాత్రి 7 గంటలకు స్వామివారి ధ్వజ అవరోహణ. ● రాత్రి 9 గంటలకు అశ్వవాహనంపై శ్రీవారి గ్రామోత్సవం.

మనకూ ఉంది డ్రోనాస్త్రం



ఈనాడు, రాజమహేంద్రవరం: **వరద నష్టం..నేర ఛేదన.. మందుల పిచికారీ.. ఆక్రమణల గుర్తింపు, రాత్రి గస్తీ.. ఇలా డ్రోన్‌లు చక్కబెట్టే పనులెన్నో. మన ఉమ్మడి జిల్లాలోనూ డ్రోన్లను పలు శాఖలు వాడుతున్నాయి. 22, 23 తేదీల్లో అమరావతిలో డ్రోన్ సమ్మిట్ జరగనుండటంతో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మనవద్ద డ్రోన్‌ల పాత్ర ఎలా ఉందో పరిశీలిస్తే..**

☛ తూర్పులో రాత్రి గస్తీలోనూ వినియోగం

☛ కోనసీమలో సిద్ధమవుతోన్న డ్రోన్ పైలట్లు

తూర్పుగోదావరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం నాలుగు డ్రోన్లు పనిచేస్తున్నాయి. పండగలు, రద్దీ వేళల్లో పరిస్థితిని చిత్రీకరిస్తూ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తూ ఎస్పీ నరసింహకిశోర్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. దసరా ఉత్సవాలు, గోదావరి వరదలు, ఇటీవల కొవ్వూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సమయంలో విస్తృతంగా డ్రోన్లు వినియోగించారు. రాత్రివేళల్లో సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా ఉంచి ఎక్కడ అవాంఛనీయ ఘటనలు, నేరాలు చోటుచేసుకున్నా.. అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నా సమీప గస్తీ సిబ్బందిని అప్రమత్తం చేసేలా వ్యవస్థ ఏర్పాటుచేశారు. డ్రోన్ల నిర్వహణపై ఇటీవల 15 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మరో 10 డ్రోన్ల కోసం ప్రభుత్వానికి నివేదించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా


రాజమహేంద్రవరంలో పోలీసు సిబ్బందికి శిక్షణ

ఆక్రమణల పనిపట్టేలా..

కాలువల ఆక్రమణలు గుర్తించేందుకు డ్రోన్ కార్పొరేషన్ నుంచి డ్రోన్లను అద్దెకు తీసుకుని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి సర్వేలు చేయించారు. కొవ్వాడ, ఎర్ర, బురద కాలువల కబ్జాలు.. గండ్లు కొట్టిన, నిర్మాణాలు దెబ్బతిన్న ప్రాంతాలను డ్రోన్లతో గుర్తించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు డ్రోన్లతో వార్డుల్లో తనిఖీల ప్రక్రియకు కమిషనర్ కేతన్ గర్గ్ శ్రీకారం చుట్టారు. వీధుల్లో వ్యర్థాలు, పూడిక తీయని కాలువలను గుర్తిస్తున్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డ్రోన్

100 మందితో ప్రత్యేక సైన్యం

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 100 మంది గ్రామ సర్వేయర్లకు డ్రోన్‌ల నిర్వహణపై అమరావతిలో కలెక్టర్ మహేశ్‌కుమార్ శిక్షణ ఇప్పిస్తున్నారు. డ్రోన్ కార్పొరేషన్ సహకారంతో ఇప్పటికే 30 మంది తర్ఫీదు పొందారు. నెలాఖరుకు అందరికీ పూర్తిచేసి డ్రోన్ పైలట్లతో సైన్యాన్ని సిద్ధం చేస్తున్నారు. అక్రమ ఆక్వా సాగు, కాలువల కబ్జాలు, వరదల అంచనా, రైల్వే లైనుకు భూసేకరణ, ఇసుక తరలింపు పర్యవేక్షణకు ఈ సైన్యాన్ని వినియోగిస్తారు. ఇప్పటికే రైల్వేలైన్ భూసేకరణకు సంబంధించి భట్నవిల్లి-పేరూరు మధ్య ఉన్న నిర్మాణాలను డ్రోన్లతో గుర్తించారు.

ఏలేరు వరద నష్ట నివారణలో కీలకపాత్ర


ఏలేరు వరద సమయంలో పరిస్థితిని డ్రోన్‌లో చిత్రీకరించారిలా..

ఇటీవల ఏలేరు వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో డ్రోన్లు కీలకపాత్ర పోషించాయి. మొత్తం 8 డ్రోన్లతో ప్రభావిత ప్రాంతాలను జల్లెడ పట్టేలా కలెక్టర్ షాన్‌మోహన్ చర్యలు చేపట్టారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలతో పటిష్ఠం చేస్తూనే, గ్రామాల్లోకి నీరు పోటెత్తకుండా 72 ప్రాంతాల్లో గండ్లు కొట్టించారు. 9 మండలాల పరిధిలో 114 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు.



కుదిరితే బేరం.. కాదంటే కయ్యం

మద్యం దుకాణదారులకు సిండికేట్ల బెదిరింపులు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

● గోపాలపురానికి చెందిన వ్యక్తికి లాటరీలో రాజమహేంద్రవరంలో రెండు మద్యం దుకాణాలు దక్కాయి. ఓ దుకాణం తొలి రోజు ప్రారంభించారు. ఇంతలో సిండికేట్ మాఫియా చేరిపోయింది. ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తే ఎలా ఊరుకుంటాం.. దుకాణం వదిలేయండి.. లేదంటే ఇక్కడ వ్యాపారం చేయలేరని హెచ్చరించింది. చేసేది లేక రూ.25 లక్షలకు దుకాణాన్ని సిండికేట్‌లకు అప్పగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

● ఇదే బ్యాచ్ నగరంలో కేటాయించిన మరో దుకాణదారుడికి ఫోన్ చేసి రూ.20 లక్షలు ఇస్తాం.. మద్యం దుకాణం వదిలేయాలని బెదిరించింది. ఆ వ్యక్తి ఓ అమాత్యుడికి దగ్గర బంధువని తేలడంతో వెనక్కు తగ్గింది. దానవాయిపేట, కోటిపల్లి బస్టాండ్ వద్ద కేటాయించిన రెండు దుకాణాల విషయంలోనూ ఇదే కొనసాగుతోంది.

ప్రభుత్వం లాబీయింగ్ లేకుండా లాటరీ విధానంలో మద్యం దుకాణాలు కేటాయిస్తే.. ఆ ప్రక్రియకు కొందరు తూట్లు పొడుస్తున్నారు. సిండికేట్‌గా ఏర్పడి బెదిరింపులకు దిగుతున్నారు. దుకాణాల కేటాయింపునకు లాటరీ తీసి రెండు రోజులు దాటినా రాజమహేంద్రవరంలో ఇంకా బెదిరింపులు కొనసాగుతున్నాయి. ఈ మాఫియా పెచ్చురేగుతుండడంతో విషయం పెద్దల వరకూ వెళుతోంది.

గుప్పెట్లో పెట్టుకోవాలని..

రాజమహేంద్రవరం నగరంలో 28 దుకాణాలను లాటరీలో కేటాయించారు. ఇప్పటికే 11 దుకాణాలను ఓ నాయకుడు గుప్పెట్లో పెట్టుకున్నారు. అదే నేత అండదండలతో వైకాపా వర్గీయులు మరో నాలుగింటిని సిండికేట్‌లో దక్కించుకున్నారు. లాటరీలో నగరంలోని దుకాణాలు దక్కించుకున్న ఇతర ప్రాంతాల్లోని వ్యక్తులను కొందరు గుర్తించి బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే కేటాయించిన చోట్ల తెరిచి విక్రయాలు జరుగుతుండగా సిండికేట్ బ్యాచ్‌లు ఫోన్లు చేసి హెచ్చరిస్తున్నాయి. దుకాణాలు వదిలేయాలని లేదంటే వ్యాపారాలు ఎలా కొనసాగుతాయో చూస్తామని హుకుంలు జారీచేస్తున్నాయి.

తలొగ్గితే సరే..

దుకాణాలు దక్కించుకున్న వారిని పిలిపించి వారితో బేరసారాలు మాట్లాడుతున్నారు. ప్రాంతం, అమ్మకాలు అంచనాలు వేసి సొమ్ములు ఆశ చూపుతున్నారు. లేదంటే వ్యాపారాలు కొనసాగించలేరని బెదిరిస్తున్నారు. అదీ లేదంటే తమ వారిని సిండికేట్‌లో చేర్చాలని, వాటాలు ఇవ్వాలని పట్టుబడుతున్నారు. కుదరకపోతే నెలవారీ కమిషన్ ఇవ్వాలని కొత్త ప్రతిపాదనలు తీసుకొస్తున్నారు. వీటిలో ఏదో ఒకదానికి తలొగ్గాలని ఒత్తిడి తెస్తున్నారు.

సౌర రథానికి సారథులేరీ?

ఈనాడు, కాకినాడ: పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్)ను గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. రాయితీల ఊతం ఇవ్వలేదు సరికదా.. ఆ శాఖను పర్యవేక్షించాల్సిన నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ల పోస్టులు ఖాళీ అయినా భర్తీకి కనీస చొరవచూపలేదు.

గతంలోనే ఉద్యోగ విరమణ చేసినా..

కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలకు నెడ్‌క్యాప్ శాఖలో జిల్లా మేనేజర్లు లేరు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ పోస్టులు ఖాళీ అయినా పట్టించుకోలేదు. దీంతో ఇదే కార్యాలయంలోని అభివృద్ధి అధికారులు ఇక్కడ పాలన వ్యవహారాలు చూస్తున్నారు. నాలుగు జిల్లాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించే కాకినాడ జిల్లా మేనేజర్ సత్యనారాయణ 2023 ఆగస్టులో పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి ఈ శాఖకు సారథులే లేరు.

కార్యాలయాలకు భారం తగ్గాలంటే..

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన నెడ్‌క్యాప్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో కదలిక వచ్చినట్లయ్యింది. సౌర విద్యుత్తు దిశగా ప్రోత్సాహానికి అడుగులు వేయడంతో నెడ్‌క్యాప్‌కు ఊపిరి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్తుకు గత నెల నుంచి సర్వే చేస్తున్నారు. ఇది సాకారమైతే.. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్తు భారం రూ. కోట్లలో తగ్గినట్లే. రాజమహేంద్రవరంలో ఆటోలకు రెట్రోఫిట్ చేసి ఇంధన ఖర్చులు తగ్గిస్తామని గతంలో సర్వేచేసినా.. తర్వాత ఆ జాడ లేదు. ఇది కార్యరూపం దాల్చాలి. ఇంధన భారం, కాలుష్యం పెరిగి.. జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో సరైన ప్రోత్సాహం అందించాల్సి ఉంది.

21 నుంచి వాడపల్లిలో ఆర్జిత సేవలు రద్దు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుంచి 29 వరకు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణం, ఇతర ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎన్. సూర్యచక్రధరరావు తెలిపారు. మళ్లీ ఈనెల 30వ తేదీ నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు భక్తులు 08855-271888 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

సభ్యత్వ నమోదులో కార్యకర్తల కృషి అభినందనీయం

ఎంపీ పురందేశ్వరి

దేవీచౌక్(రాజమహేంద్రవరం): జిల్లాలో సభ్యత్వ నమోదులో కార్యకర్తల కృషి అభినందనీయమని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ఆధ్వర్యంలో శుక్రవారం సభ్యత్వ నమోదుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బాధ్యుడు సిద్ధార్థ్ నాథ్‌సింగ్, పురందేశ్వరి, జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. వంద సభ్యత్వాలు పూర్తి చేసిన కార్యకర్తలకు క్రియాశీల సభ్యత్వాలు ఇచ్చారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర నాయకులు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, అడబాల రామకృష్ణారావు, కృష్ణభగవాన్, పరిమి రాధాకృష్ణ, రొంగల గోపి శ్రీనివాస్, నర్సిపల్లి హారిక, ఉన్ని కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.


కార్యకర్తకు క్రియాశీల సభ్యత్వం అందజేస్తున్న సిద్ధార్థ్‌నాథ్‌సింగ్, పురందేశ్వరి తదితరులు

జాతీయ రహదారిగా కెనాల్ రోడ్డు

కార్యక్రమంలో పురందేశ్వరి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు చేయడంలో కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. సభ్యత్వ నమోదులో జిల్లా రాష్ట్రంలోనే నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ అభివృద్ధికి మరిన్ని నిధులు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. అనపర్తి కెనాల్ రోడ్డును జాతీయ రహదారిగా ప్రకటించి, అభివృద్ధిపై దృష్టి సారిస్తామని కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ చెప్పారన్నారు.

ఎస్సీ వసతి గృహాలకు కొత్త భవనాలు

తొమ్మిదిచోట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం)

గత వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన సంక్షేమ వసతి గృహాలపై ఎన్డీయే కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహ భవనాల స్థానే కొత్తవి నిర్మించేందుకు నిర్ణయించింది. ప్రధాన మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం-ఏజేఏవై) కింద కేంద్ర నిధులతో చేపట్టే ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల కొత్త భవనాలకు మన జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించాలని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. తొమ్మిది ఎస్సీ హాస్టళ్ల భవనాలను గుర్తించారు. ఆరుచోట్ల కొత్త భవన నిర్మాణాలకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపగా.. మరో మూడింటికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతిగృహాలు మొత్తం 36 ఉండగా వీటిలో పాఠశాల విద్యార్థులుండేవి(ప్రీ మెట్రిక్ హాస్టళ్లు) 29 కాగా మిగతా ఏడు కళాశాల విద్యార్థులుండేవి(పోస్టుమెట్రిక్). ప్రస్తుతం సొంత భవనాల్లో కొనసాగుతున్న 29 వసతి గృహాల్లో తొమ్మిది 1985కు ముందు నిర్మించినవి కావడంతో శిథిల దశకు చేరుకున్నాయి. తొలుత వీటికి కొత్త భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదించారు.

జిల్లాలో ఇలా..

సాంఘిక సంక్షేమ వసతి గృహాలు	36
ప్రస్తుతమున్న విద్యార్థుల సంఖ్య	2,400
సొంత భవనాల్లో నడుస్తున్నవి	29
ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నవి	07
కొత్త భవనాలకు ప్రతిపాదించినవి	09


కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదించిన కోరుకొండ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం

ప్రీమెట్రిక్ హాస్టళ్లకు..

జిల్లా నుంచి తొమ్మిది సాంఘిక సంక్షేమ ప్రీ మెట్రిక్ హాస్టళ్లకు కొత్త భవనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటిలో అయిదు బాలుర, నాలుగు బాలికల ఎస్సీ హాస్టళ్లు ఉన్నాయి.

రూ.3 కోట్లతో నిర్మాణం

ఒక్కో భవన నిర్మాణానికి రూ.3 కోట్లు చొప్పున కేంద్ర నిధులు మంజూరయ్యే అవకాశముందని, త్వరలో కొత్త భవన నిర్మాణాలు జరుగుతాయని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం.సందీప్ తెలిపారు.

ప్రతిపాదనలు పంపిన హాస్టళ్లు

● కోరుకొండ ఎస్సీ బాలురు, బాలికలు
● కొవ్వూరు ఎస్సీ బాలురు, బాలికలు
● ఉండ్రాజవరం బాలురు, నిడదవోలు(సమిశ్ర గూడెం) బాలికలు

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నవి

దేవరపల్లిలో రెండు ఎస్సీ బాలురు, ఒక ఎస్సీ బాలికల వసతి గృహాలు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

రాజానగరం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత విషయాలు, సోషల్ మీడియాలో పంచుకోవడం ద్వారా సైబర్ నేరగాళ్లకు మనమే అవకాశం ఇచ్చిన వారమవుతున్నామని సైబర్ క్రైమ్ అదనపు ఎస్పీ ఆస్మా ఫర్హీన్ అన్నారు. గైట్ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో కొందరు తెలియక మోసపోతుంటే, మరికొందరు అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. సీఐడీ సైబర్ క్రైమ్ ఎస్పీ కృష్ణ ప్రసన్న నేతృత్వంలో నిర్వహించిన ఈ సదస్సులో రాజమహేంద్రవరం, మంగళగిరి సీఐడీ కార్యాలయాల నుంచి వచ్చిన సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ డి.రాంబాబు, మహిళా ఎస్ఐలు రాజవర్ష, ఈ.రచన సైబర్ క్రైమ్ జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.ఎమ్.డి ధనరాజు, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్‌మీరా తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధికారులు

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

● కొత్త వ్యక్తులు పంపించే సందేశాలు, యూట్యూబ్ వీడియో లింక్స్, యాప్స్ , ఫోన్‌కాల్స్ తిరస్కరించాలి. ● సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ప్రకటనలు, ఆఫర్ల పట్ల ఆకర్షితులు కావద్దు. ● మీ బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, పాన్, ఏటీఎం నంబరు, పిన్ నంబరు, ఓటీపీ వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోకూడదు. ● లోన్ యాప్‌లను చరవాణిలో ఇన్‌స్టాల్ చేయకూడదు. ● సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం లేదా ఫిర్యాదు అందించాలి.

ఇసుక బుకింగ్‌లో సమస్యలు లేకుండా చూడాలి

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ఇసుక ఆన్‌లైన్ బుకింగ్‌లో సమస్యలు తలెత్తకుండా చూడాలని, సాంకేతిక పరమైన ఇబ్బంది ఏర్పడితే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు జేసీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇసుక బుకింగ్ నుంచి రవాణా వరకు ఎటువంటి ఆటంకం లేకుండా సజావుగా ప్రక్రియ సాగేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ఆఫ్‌లైన్ విధానంలో గత విధానాన్నే అనుసరించాలని స్పష్టం చేశారు. వినియోగదారుడికి సాధ్యమైనంత ఎక్కువ ఇసుక అందుబాటులో ఉంచాల్సి ఉందన్నారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ పనుల కోసం వినియోగించాలన్నారు. ప్రతి రీచ్‌కు.. సమీపంలో ఉన్న సచివాలయం ద్వారా ఇసుక రవాణాకు టోకెన్లు జారీ చేయాలని, ప్రతి పది ఆర్డర్లకు పోలీసు సిబ్బంది బందోబస్తుగా పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలున్నాయని, వీటిపై ఆర్డీవోల వివరణ కోరినట్లు తెలిపారు.

ధాన్యం సేకరణలో సమన్వయం ముఖ్యం

ధాన్యం సేకరణలో సమన్వయం ముఖ్యమని కలెక్టర్ చెప్పారు. ఆర్డీవో ఆధ్వర్యంలో వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులు సమన్వయం చేసుకోవడం, రైతు సేవా కేంద్రాల వారీగా మిల్లర్ల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం చేయాలన్నారు. గోనె సంచుల సరఫరా విషయంలో సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.

భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

చాగల్లు, న్యూస్‌టుడే: భూముల రీసర్వే సందర్భంగా తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కొవ్వూరు మండలం చిడిపిలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సిబ్బందితో కలిసి భూ దస్త్రాలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. సభలో 18 అర్జీలు అందాయని, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామసభలో సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి



పొగాకు రైతులకు సూచనలిస్తున్న రీజనల్ మేనేజర్ ప్రసాద్

ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి పెట్టాలి

గోపాలపురం, న్యూస్‌టుడే: పరిమితిని మించి పొగాకు ఉత్పత్తి చేయకూడదని బోర్డు రీజనల్ మేనేజర్ జీవీకే ప్రసాద్ సూచించారు. గోపాలపురం పొగాకు బోర్డు పరిధిలోని రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రసాద్ మాట్లాడుతూ గత రెండేళ్లలో ఇతర దేశాల్లో అకాల వర్షాలు, అనావృష్టి కారణంగా సాగు అనుకున్న విస్తీర్ణంలో పెంచకపోవడం వల్ల మన దేశంలో పొగాకు ధర బాగుందన్నారు. నిర్ణయించిన సాగు కంటే అధికంగా పండిస్తే అపరాధ రుసుం తప్పదని హెచ్చరించారు. ప్రతి రైతు పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలన్నారు. దీని ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఎస్‌కే నరసింహారావు, శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాసరావు, వేలం కేంద్ర నిర్వహణ అధికారులు శ్యామ్, హేమ స్మిత, రైతులు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యం



అన్నవరం దేవస్థానం అనివేటి మండపంలోని ధ్వజస్తంభంపై స్వర్ణ కలశాలు, సుదర్శన చక్రం భక్తులు వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. దాత సహకారంతో నూతన ధ్వజస్తంభానికి బంగారు తాపడంతో ఇటీవల సిద్ధం చేశారు. పైఅంతస్తులో స్వామి, అమ్మవారు, పరమేశ్వరుల మూలవిరాట్ దర్శనం తర్వాత దిగువ అంతస్తులో యంత్రాలయం దర్శనానికి భక్తులు వస్తారు. అనివేటి మండపంలో ధ్వజస్తంభం చుట్టూ ప్రదక్షిణ చేసే సమయంలో పైన స్వర్ణ కలశాలు, సుదర్శన చక్రం కూడా వీక్షించేలా తాజాగా అద్దం ఏర్పాటుచేశారు. పై నుంచి వర్షం నీరు కిందకు రాకుండా ఈ అద్దం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, అన్నవరం

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్, గుంటూరు రెండో అదనపు జిల్లా జడ్జి సత్యవతి

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం సాయంత్రం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.రాధాకృష్ణ కృపాసాగర్, గుంటూరు రెండో అదనపు జిల్లా జడ్జి బీవీఎల్ సత్యవతి దర్శించుకున్నారు. వీరికి వేదపండితులు, ఆసాదులు ఘనంగా స్వాగతం పలికారు. వారితో పాటు పెద్దాపురం ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి, సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప, మున్సిఫ్ మెజిస్ట్రేట్ జి.బుల్లెమ్మ దర్శించుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వేదుల సుబ్రహ్మణ్యం(మణి), సభ్యులు మడికి రాంబాబు, విశాలాక్షి, పిట్ల రమణ, దేవాలయ సహాయ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సామర్లకోట రైల్వేస్టేషన్‌కు స్వచ్ఛభారత్ పురస్కారం



సామర్లకోట: సామర్లకోట రైల్వేస్టేషన్‌కు స్వచ్ఛభారత్ పురస్కారం దక్కింది. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారాలు అందించారు. ఇటీవల రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలకుగాను డీఆర్ఎం చేతుల మీదుగా సామర్లకోట రైల్వేస్టేషన్ చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి పురస్కారం అందుకున్నారు. ఆమెను స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు అభినందించారు.

ఐటీఐలు.. నైపుణ్య కేంద్రాలు

గత ఐదేళ్లతో పోలిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే ఐటీఐలకు డిమాండ్ పెరిగింది. గతంలో ప్రభుత్వ ఐటీఐల్లో సైతం సీట్లు భర్తీ కాకపోగా ప్రైవేటులో 50-60 శాతం మాత్రమే భర్తీ అయ్యేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యమివ్వడంతో వీటిల్లో చేరే వారిసంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికితోడు నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు అడుగులు వేస్తుండటంతో ఉపాధి కేంద్రాలుగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

- న్యూస్‌టుడే, గాంధీనగర్, ధవళేశ్వరం

ఆధునిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగ కల్పన విభాగం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఐటీఐల్లో చదివిన విద్యార్థులు 75 శాతం మందికి ఎల్అండ్‌టీ బెంగళూరు, చెన్నై, ఐటీసీ, నూకాన్ ఏరోస్పేస్ వంటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. మిగిలిన 25 శాతం మందిలో కొందరు బ్రిడ్జ్‌కోర్సు ద్వారా పాలిటెక్నిక్‌లో చేరగా, మరికొందరు ప్రభుత్వ కంపెనీల్లో అప్రెంటిస్ కోసం వెళ్లారు. మరికొందరు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలిలా..

జిల్లా	ఐటీఐలు	సీట్లు	భర్తీ శాతం
కాకినాడ	ప్రభుత్వ-2	684	99.4
	ప్రయివేట్-12	1448	85
కోనసీమ	ప్రయివేట్-15	2236	80
తూర్పుగోదావరి	ప్రయివేట్-12	1340	86
	ప్రభుత్వ-1	132	100



టర్నర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నూతన కోర్సులకు శ్రీకారం

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 13 కోర్సుల్లో 1,048 మంది శిక్షణ పొందుతున్నారు. వీటిలో రెండు సంవత్సరాల కోర్సులు 9, ఏడాది కోర్సులు 4 ఉన్నాయి. ప్రైవేట్ ఐటీఐల్లో సుమారు ఆరు కోర్సులను నిర్వహిస్తున్నారు. కొత్తగా డ్రోన్ టెక్నాలజీ, సోలార్ ఎలక్ట్రీషియన్ కోర్సులను రెండు మూడు నెలల్లో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం వీటికి డిమాండ్ ఉండటంతో వీటి ద్వారా మరింత మంది నిపుణులను అందుబాటులో తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. సీట్ల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.1.93 కోట్లతో స్ట్రైవ్ ప్రాజెక్టు ద్వారా ట్రేడ్ అప్‌గ్రేడేషన్, మౌలిక వసతుల కల్పనకు నిధులు ఖర్చు చేస్తున్నారు. వీటితో కంపెనీలకు కావాల్సిన విధంగా యంత్ర సామగ్రి కొనుగోలు చేసి శిక్షణ ఇస్తున్నారు. దీనికితోడు ఏపీఎస్ఎస్‌డీసీ వారి స్కిల్‌హబ్ ద్వారా మల్టీస్కిల్‌లో భాగంగా మరొక ట్రేడ్‌లో మూడు నెలల శిక్షణ ఇస్తున్నారు. తద్వారా రెగ్యులర్‌తో పాటు స్వల్పకాలిక కోర్సు ద్వారా మరిన్ని నైపుణ్యాలు పెంచుకునేలా చేస్తున్నారు.

పరిశ్రమలతో అనుసంధానం..

నూతన విధానంలో భాగంగా విద్యార్థులకు స్థానిక కంపెనీలతో శిక్షణ ఇచ్చేలా చేస్తున్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలోని ల్యాబ్‌లలో సౌకర్యాలు, యంత్రాలు సమకూరుస్తున్నారు. కోరమాండల్ కంపెనీ ఇన్‌స్ట్రుమెంట్ మెకానికల్ ల్యాబ్‌ను, వరుణ్ మోటార్స్ వారు మోటార్, డీజిల్ మెకానిక్‌లో ఎంవోయూ చేసుకొని శిక్షణ అందిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు మెండు...

ఐటీఐ పూర్తిచేస్తే ఉపాధి అవకాశాలు బాగున్నాయి. ప్రభుత్వం నైపుణ్యత, ఉద్యోగిత లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో గతంలో కంటే ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరిగింది. రెగ్యులర్ కోర్సులతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తుండటం, పరిశ్రమలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం ద్వారా మెరుగైన నైపుణ్యాలను నేర్పించగలుగుతున్నాం.

- మంతెన వేణుగోపాలవర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్

కంకర రోడ్డు హామీ నెరవేర్చరేమీ..?

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సంస్థ సిబ్బంది తీరుపై ఆందోళన

దేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాల బారినపడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు యాదవోలు-జగన్నాధపురం రహదారిలో గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ సామగ్రి పాయింట్ వద్ద సుమారు 100 మంది రైతులు శుక్రవారం వాహనాలను నిలిపివేసి ఆందోళనకు దిగారు. నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రోడ్డంతా పెద్ద గుంతలు పడి వర్షం కురిస్తే వాహనాలు జారిపోయి గాయాలపాలవుతున్నామని వారు వాపోయారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు ప్రాజెక్టు మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

ఎంతో ప్రాధాన్యమున్నా..

ఈ రహదారిలో నిత్యం సుమారు 200 మంది రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గంలోనే జగనన్న కాలనీ ఉంది. ఇక్కడ 305 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. సుమారు 7 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్డును 2017-18 సంవత్సరాల్లో రైతులు సొంత నిధులు రూ. 5 లక్షలతో అభివృద్ధి చేసుకున్నారు. 2019లో మండల పరిషత్తు నిధులు రూ.40 లక్షలతో గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణం సమయంలో రైతులతో సమావేశమై కంకర రోడ్డు వేసిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని సంస్థ హామీ ఇచ్చి.. ఇప్పుడు సంబంధం లేదంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి అభివృద్ధి చెయ్యకపోతే నిర్మాణ పనులు నిలిపివేస్తామని శుక్రవారం రైతులు బల్లే నాగేశ్వరరావు, పట్టపు వివేకా, సొంటెం సోమరాజు, తమ్మిరెడ్డి నాగేశ్వరరావు, సింగంశెట్టి ఏడు కొండలు, బుట్ట బాటయ్య, తమ్మిరెడ్డి సత్యనారాయణ, కరిపెట్టి దుర్గారావు, ఇతర రైతులు ఆందోళనకు దిగారు.



వాహనాలు నిలిపివేసి ఆందోళన చేస్తున్న రైతులు

నిత్యం ప్రమాదాలు..



గతంలో రోడ్డు నిర్మిస్తామని హైవే నిర్మాణ సంస్థ హామీ ఇచ్చి ఇప్పుడు సంబంధం లేదంటోంది. రైతులు ఇబ్బంది పడితే మాకెందుకన్నట్లు ప్రాజెక్టు మేనేజర్ సమాధానం చెబుతున్నారు. గడిచిన నెల రోజుల్లో సుమారు 40 మంది వరకు గాయాలపాలయ్యారు. ఇద్దరు, ముగ్గురికి చెయ్యి, కాలు విరిగాయి. ఇప్పటికైనా జాతీయ రహదారికి సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

- నుదురుమాటి శ్రీనివాస్, రైతు నాయకుడు

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌కు దరఖాస్తులు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): ఆర్టీసీలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్ ట్రేడ్‌లలో అప్రెంటిస్‌షిప్ కోసం ఐటీఐ పాసైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 20 నుంచి 31వ తేదీలోగా www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒరిజనల్ ధ్రువపత్రాల పరిశీలన(వెరిఫికేషన్) నిమిత్తం నవంబరు 8న ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా వి.టి.అగ్రహారంలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలు, సందేహాల నివృత్తి కోసం 08922-294906 ఫోన్ నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

సాగునీటి విడుదల

ధవళేశ్వరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 7,100 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1800, 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతుందన్నారు. 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జరిమానా

దానవాయిపేట(రాజమహేంద్రవరం): మద్యం మత్తులో వాహనాలు నడిపినా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. గత నెల రోజులుగా జిల్లాలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ డ్రైవ్‌లలో 172 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. గత రెండు రోజులుగా మరో 20 మందిపై కేసులు నమోదు చేయగా వారిని శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచామన్నారు. వారిలో 18 మందికి రూ.5 వేలు, ఇద్దరికి రూ.1,500 చొప్పున మొత్తం రూ.93 వేలు న్యాయమూర్తి జరిమానా విధించారన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

కోడి పందేల నిర్వాహకుల అరెస్టు

రంగంపేట: మండలంలో కోడి పందేల నిర్వాహకులను, పందేలు ఆడేవారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. రంగంపేట మండలం ముకుందవరంలో ఈ నెల 16న భారీగా టెంట్లు ఏర్పాటు చేసి వినోదాలు, జూదం బోర్డులు ఏర్పాటు చేశారు. సమీప మండలాల నుంచి భారీగా జూదరులు పాల్గొనడంతో అనపర్తి సీఐ సుమంత్ ఆధ్వర్యంలో బిక్కవోలు, అనపర్తి మండలాల పోలీసులు దాడి చేశారు. దీనిలో రాజానగరం, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల 28మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2.10 లక్షలు, రెండు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలు, 18 కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను పోలీసులు వెల్లడించారు. ఈ దాడిలో పట్టుబడిన వారి పేర్లు గోప్యంగా ఉంచడంతో పాటు, మండలంలోనే పందేలు జోరుగా సాగుతున్నా ఈ దాడిల్లో స్థానిక పోలీసులు పాల్గొనకపోవడంపై పలువురు అనుమానాలను వ్యక్తపరుస్తున్నారు.

ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు



మణికంఠ నవీన్

దేవీచౌక్(రాజమహేంద్రవరం): ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని 2024 బయాథ్లే/ట్రైథల్లే వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో సభ్యుడు వరద మణికంఠ నవీన్ తెలిపాడు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ యానాంలోని నల్లం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాను అక్కడే ఉన్న ఓ అకాడమీలో స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్‌లో శిక్షణ పొందానని వెల్లడించాడు. కోచ్ గ్రంధి రవితేజ ప్రోత్సాహంతో ఈజిప్టులోని పోర్టు సైడ్‌లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగిన యూఐపీఎం 2024 బయాథ్లే/ట్రైథల్లే వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని అండర్-17 కేటగిరిలో తమ జట్టు కాంస్య పతకం సాధించడానికి దోహదపడ్డానన్నాడు. త్వరలో జరగనున్న ఏషియన్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనేది తన కోరిక అని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరాడు. ఈ సమావేశంలో నవీన్ తల్లిదండ్రులు ఈశ్వరరావు, హారిక పాల్గొన్నారు.

అట్టహాసంగా స్కేటింగ్ పోటీలు ప్రారంభం



జ్యోతితో స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొనాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్, కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి కార్యక్రమం ప్రారంభించారు. డీఈవో పి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ అండర్-11, 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతున్నాయన్నారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 400 మంది పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రదర్శనతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తలాటం హరీష్, డీఎస్ఏ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కోశాధికారి సీహెచ్ రమేష్, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, కె.నూకరాజు, పీఈటీలు రవిసుందర్, కౌర్, సుధాకర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలు



రైఫిల్ షూటింగ్‌లో సాధన

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండలంలోని సంపతనగరంలో గల రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి శుక్రవారం తెలిపారు. పాఠశాల ఛైర్మన్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. వారందరికీ అవసరమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డీఎస్ఈఓ వాసుదేవరావు తదితరులు పాల్గొంటారన్నారు.

పోలవరం నిర్మాణంపై విధి విధానాలు ప్రకటించాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

టి.నగర్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: పోలవరం నిర్మాణంపై విధి విధానాలు ప్రకటించాలని మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ కోరారు. రాజమహేంద్రవరంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు కేంద్రం మెగా ఇంజినీరింగ్ సంస్థను కొనసాగిస్తున్నట్లు మాత్రమే ప్రకటన ఇచ్చిందన్నారు. వరద తగ్గిన తర్వాత డయాఫ్రం వాల్ ఎక్కడ కడతారు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిస్థితి ఏంటనేది వివరణ ఇవ్వలేదన్నారు. జగన్ హయాంలో మెగా సంస్థ గైడ్ బండ్ నిర్మాణం చేయగా అది కుంగిపోయిందన్నారు. ప్రాజెక్టును అదే సంస్థకు మళ్లీ అప్పగించడంపై మతలబు ఏంటన్నారు. ప్రాజెక్టు నిర్మాణం తర్వాత ఎక్కడైనా చిన్న లీకేజీ జరిగినా 18 వేల ఎకరాల సాగుభూమి సముద్రంలో కలిసిపోతుందన్నారు. మళ్లీ టెండర్లు పిలిచి, పనులు అప్పగించాలన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి ఉందన్నారు. ఇసుక, మద్యం విషయంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

రాజమహేంద్రవరం

సినిమాలు దానవాయిపేట, న్యూస్‌టుడే: శ్యామల: వేట్టయన్, ఊర్వశి: సత్యం సుందరం, సూర్యాప్యాలెస్: ఇద్దరు, రాజా: మార్టిన్, కుమారి, అప్సర: దేవర, అశోక: విశ్వం, స్వామి: స్వాగ్, అనుశ్రీ: జనక అయితే గనక, సూర్యమినీ: జిగ్రా, రంభ: రాధే కృష్ణ, మూనాన్సు సూపర్ హీరో (రెండేసి ఆటలు), మేనక: కల్లు కాంపౌండ్, మార్టిన్ (రెండేసి ఆటలు), శివజ్యోతి: లవ్ రెడ్డి, ది డీల్ (రెండేసి ఆటలు), వీఎస్ మహల్: వేట్టయన్, విశ్వం (రెండేసి ఆటలు).



విజేతలను ట్రోఫీతో అభినందిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్రరావు

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

భీమవరం డీఎన్ఆర్ కళాశాలలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగిన నన్నయ విశ్వవిద్యాలయం అంతర కళాశాలల పోటీల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బ్యాడ్మింటన్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జట్టును కళాశాల ప్రిన్సిపల్ కె.రామచంద్రరావు, క్రీడా విభాగం బాధ్యుడు ఎం.ప్రసాద్, పీడీలు వెంకటలక్ష్మి, విజయ్‌లు అభినందించారు.

కళాశాల కబుర్లు

ప్రీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థి అజయ్‌నాయుడు ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి నన్నయ విశ్వవిద్యాలయం నిర్వహించిన ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక య్యాడు. తొలిసారిగా ఎన్ఎస్ఎస్ తరఫున ఆర్మీకి ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపల్‌తో పాటు ఎన్ఎస్ఎస్ అధికారులు తదితరులు అభినందించారు. – న్యూస్‌టుడే, దేవీచౌక్

ఉద్యానం.. కాస్త ఆహ్లాదం

టి.నగర్, న్యూస్‌టుడే: ఏవీ నాగేశ్వరరావు పార్కు అపరిశుభ్రంగా ఉన్న తీరుపై 'ఉద్యానం.. ఏదీ ఆహ్లాదం' శీర్షికన 'ఈనాడు'లో ఈ నెల 10న ప్రచురితమైన కథనంపై నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. పార్కులో ముందు నిర్వాహణలో భాగంగా చెరువులో వర్థ్య నీరు నిల్వ చేయగా భారీగా గుర్రపు డెక్క పెరిగిపోయింది. సిబ్బంది దీన్ని తొలగించారు.



వ్యర్థాల తొలగింపు అనంతరం చెరువు ఇలా..

స్పందనకు వందనం

న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్ (రాజమహేంద్రవరం)

పరీక్ష రాద్దాం.. ప్రతిభ చాటుదాం..

7, 10 తరగతి విద్యార్థులకు అవకాశం

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులకు నగదు బహుమతి అందించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫని స్వచ్ఛంద సంస్థ ప్రతిభ పరీక్ష ఏటా నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో విజయం సాధిస్తే ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి సాధించవచ్చు. ఇంకెందుకు ఆలస్యం.. పరీక్ష రాసేద్దాం.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నగరంలో 21 ప్రభుత్వ పాఠశాలలుండగా వీటిల్లో 7, 10 తరగతుల్లో సుమారు 1,550 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం 7, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొనవచ్చు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను ఇటీవల విడుదల చేసినట్లు నగర పాఠశాలల తనిఖీ అధికారి(డీఐ) బి.దిలీప్‌కుమార్ తెలిపారు. అక్టోబరు 15 నుంచి నవంబరు 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు.

విజేతలకు నగదు బహుమతి

ఈ పోటీల్లో మొత్తం 162 మంది విజేతలకు దాదాపు రూ. 9 లక్షల విలువైన నగదు బహుమతులు అందించనున్నారు. మరో 1,752 మందికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో పదో తరగతిలో ప్రథమ బహుమతిగా రూ. 30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 25 వేలు, తృతీయ బహుమతిగా రూ. 20 వేలు ప్రకటించారు. ఏడో తరగతిలో రాష్ట్రస్థాయి మొదటి విజేతకు రూ. 20 వేలు, ద్వితీయ విజేతకు రూ. 15 వేలు, మూడో విజేతకు రూ. 10 వేలు బహుమతిగా అందిస్తారు. www.educationalepiphany.orgను సంప్రదించవచ్చు.

మూడు స్థాయిల్లో

ఆన్‌లైన్ ద్వారా ఈ పరీక్ష మూడు స్థాయిల్లో జరుగుతుంది. 40 శాతం మార్కులు ప్రిలిమినరీ పరీక్షలో సాధిస్తే.. అడ్వాన్స్‌డ్, మెయిన్ పరీక్షకు అనుమతిస్తారు. ఏస్థాయి పరీక్ష అయినా 60 నిమిషాల పాటు జరుగుతుంది. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నపత్రం ఉంటుంది. ప్రిలిమినరీ పరీక్ష డిసెంబరు 29న ఉంటుంది. ఈ పరీక్షను స్కూలు లేదా ఇంట్లో ఇంటర్నెట్ సదుపాయం కలిగిన సెల్‌ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా రాస్తే సరిపోతుందని డీఐ పేర్కొన్నారు.

సిలబస్ ఇలా

ఈ పరీక్షలో విజయం సాధించాలంటే ప్రస్తుతం పాఠశాలల్లో చెబుతున్న సిలబస్‌నే చదువుకోవాలి. ఈ సిలబస్ నుంచి 80 శాతం ప్రశ్నలుంటాయి. మిగిలిన 20 శాతం ప్రశ్నలు జనరల్‌నాలెడ్జ్‌కు సంబంధించినవి.

సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మంచి అవకాశం. ఇటువంటి ప్రతిభ పరీక్షలకు హాజరుకావటం వల్ల శక్తి, సామర్థ్యాలు తెలుస్తాయి. మనం ఎంత వరకు చదువుతున్నాం. ఏఏ అంశాల్లో బాగా చదవాలన్నది తెలుస్తుంది. **- బి.దిలీప్‌కుమార్, డీఐ రాజమహేంద్రవరం**

ఆలయానికి విరాళం

అయినవిల్లి, న్యూస్‌టుడే: సిద్ధివినాయకస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు శుక్రవారం రాజమహేంద్రవరానికి చెందిన మంగళంపల్లి శ్రీనివాస సుబ్రహ్మణ్య సంగమేశ్వరశర్మ కుటుంబ సభ్యులు రూ.60 వేలు విరాళాన్ని ఈవో సత్యనారాయణరాజుకు అందజేశారు. దాతకు ఈవో స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఉచిత వైద్య శిబిరం

టి.నగర్: స్టార్ హాస్పటల్స్, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 20న మల్టీ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టు ఎదురుగా కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి వైద్య శిబిరం జరుగుతుందన్నారు. గుండె, లివర్, క్యాన్సర్, కిడ్నీ విభాగాల్లో స్క్రీనింగ్ తదితర వైద్య పరీక్షలు జరుగుతాయన్నారు.

పరీక్ష ప్రశాంతం

శ్యామలాసెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఆన్‌లైన్ విధానంలో డిజిటల్ కేంద్రంలో శుక్రవారం కొనసాగింది. ఉదయం జరిగిన పరీక్షకు 240 మందికి గాను 222 మంది, మధ్యాహ్నం పరీక్షకు 240 మందికి గాను 207 మంది హాజరయ్యారని డీఈవో కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో చెప్పారు.

పోటీలకు ఎంపిక

శ్యామలాసెంటర్: స్కూల్ గేమ్స్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో జరిగిన ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపికల్లో నెహ్రూనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కేవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్-14 బాలికల విభాగంలో కె.అశ్విని, కె.భవ్య, బి.భవాని, అండర్-17 బాస్కెట్‌బాల్ విభాగంలో ఆర్.మౌనిష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు, పీఈటీలను అభినందించారు.

ఇసుక అందుబాటులో ఉంచాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: వినియోగదారులందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని నిర్మాణ రంగం ఇబ్బందులు తొలగించాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శ్యామలా సెంటర్ వద్ద సీపీఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సుందర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమామహేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బోట్స్‌మెన్ సొసైటీలు, ఓపెన్ రీచ్‌లకు అనుమతులు ఇచ్చామని, ఈ నెల 16 నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ అందుబాటులో ఉంటుందని అధికారులు చేసిన ప్రకటనకు, ఆచరణకు పొంతన లేదని విమర్శించారు. నోస్టాక్ బోర్డుల వల్ల వినియోగదారులకు కష్టాలు తప్పడం లేదని అన్నారు. తక్షణం ప్రభుత్వం చర్యలు తీసుకుని అందరికీ ఉచిత ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

పీజీలో ప్రవేశం కల్పించాలి

దేవీచౌక్, న్యూస్‌టుడే: ప్రైవేటు కళాశాలల మాదిరి పీజీ సెట్‌తో సంబంధం లేకుండా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరుగుతున్న స్పాట్ అడ్మిషన్లలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అవకాశం కల్పించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని భాజపా కార్యాలయంలో పూర్వ విద్యార్థుల సంఘం సహ కార్యదర్శి అలికాని సత్యశివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు పురందేశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు కళాశాలల్లో మిగిలిన పీజీ సీట్లను పీజీ సెట్‌కు హాజరుకాని, అర్హత సాధించని వారికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలలకు ఇచ్చినట్లే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో మూడో ఫేజ్‌లో మిగిలిన సీట్లను పీజీ సెట్‌తో సంబంధం లేకుండా డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశం ఇవ్వాలని కోరారు.

న్యాయవాదుల హర్షం



వేడుకలో అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, సభ్యులు

దానవాయిపేట(రాజమహేంద్రవరం): న్యాయదేవత చేతిలో భారత రాజ్యాంగం ఉంచడంతోపాటు కళ్లకు ఉన్న గంతలను విప్పడం ఓ చారిత్రక నిర్ణయమని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని తీసుకున్న సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి సొసైటీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాజమహేంద్రవరంలోని జిల్లా కోర్టు ఎదుట సొసైటీ ఆధ్వర్యంలో హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టిముక్కల అనంతరావు, కాశీ శ్రీనివాసరావు, బీర అరుణ్‌కుమార్, కరుణాకర్‌రాజు, పీఎల్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావు సేవలు అమూల్యం



వై.ఎస్.నరసింహారావు స్మారక పురస్కారంతో కృష్ణకుమార్‌కు సత్కారం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాజ హితం కోసం ఆంధ్ర కేసరి యువజన సమితి పేరుతో సంస్థను ప్రారంభించి, నిరుపేద విద్యార్థులకు అండగా ఆంధ్రకేసరి విద్యాసంస్థలను స్థాపించిన మహనీయుడు వై.ఎస్.నరసింహారావు సేవలు అమూల్యమని ఏకేసీ కళాశాల ఛైర్మన్ షేక్ అసదుల్లా అహ్మద్ అన్నారు. ఆంధ్రకేసరి డిగ్రీ కళాశాలలో నరసింహారావు 88వ జయంతి వేడుక శుక్రవారం నిర్వహించారు. విద్యాసంస్థల అభివృద్ధికి ఆయన కృషిని కొనియాడారు. నరసింహారావు పేరిట పురస్కారంతో పాత్రికేయుడు వి.ఎస్.ఎస్.కృష్ణకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి, దేశిరెడ్డి బలరామ నాయుడు, మాదిరాజు శ్రీనివాస్, శిఖాకొల్లి సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● ఆంధ్రకేసరి సెంటినరీ జూనియర్ కళాశాలలో వై.ఎస్.నరసింహారావు జయంతి వేడుక నిర్వహించారు. కళాశాల వ్యవస్థాపకుడు నరసింహారావు అందించిన సేవలను హాజరైన సభ్యులు కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, జమ్మి రామారావు, ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తొలగింపు తూతూమంత్రమేనా..!

యథాస్థానంలో మళ్లీ ఆక్రమణలు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

పుష్కరాల నేపథ్యంలో నగరంలో ఆక్రమణలు తొలగించేందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం కొద్దిరోజులుగా చర్యలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఒకపక్క తొలగిస్తుండగా.. మరోపక్క మళ్లీ ఆక్రమణలు పుట్టుకొస్తున్నాయి. అధికారులు పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించకపోవడం ఇందుకు ప్రధాన కారణం అవుతోంది. రోడ్డు ఆక్రమణలు, కాలువలపై నిర్మాణాల విషయంలో ఉదాసీనంగా ఉంటున్నారు. కాలువలపై సిమెంటుతో కట్టిన నిర్మాణాలను తొలగించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో పరిస్థితి యథాస్థితికి చేరుతోంది. దీనికి తోడు రాజకీయ ప్రమేయం తోడవ్వడంతో మళ్లీ పాదచారుల మార్గాలు ఆక్రమణలతో నిండిపోతున్నాయి.

పుష్కరాలకు లక్షల్లో వచ్చే భక్తులకు దృష్టిలో పెట్టుకుని నగరంలోని రహదారులు, కాలువలను విస్తరించాలని యంత్రాంగం భావించింది. రోడ్లు వెడల్పు చేయాలంటే ముందుగా ఆక్రమణలు తొలగించాల్సిన అవసరం ఉంది. దీంతో నగరంలో మొత్తం రద్దీగా ఉన్న రోడ్లు, వాటి ఆక్రమణలు గుర్తించారు. తొలుతగా మూలగొయ్యి, జాంపేట, ఆజాద్‌చౌక్, కంబాలచెరువు ప్రాంతాల్లో తొలగించేందుకు సిద్ధమయ్యారు. ఈ ప్రాంతాల్లో ఏకంగా నడక మార్గాల్లో దుకాణాలు, రోడ్డుపై వ్యాపారాలతో నిండిపోయాయి. ఇక్కడ 40 నుంచి 60 అడుగుల రోడ్డు ఉన్నప్పటికీ కనీసం వెళ్లేందుకు 20 అడుగుల మార్గం కూడా కనిపించకపోవడం గమనార్హం. వ్యాపార దుకాణాలు, వాహన పార్కింగ్ పోనూ. మిగిలిన రోడ్డులో వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి.



జాంపేట వంతెను దిగువకు రోడ్డుపైనే దుకాణాలు



ఆజాద్ చౌక్ సెంటర్లో ఫుట్‌పాత్ ఆక్రమణ

చూసీచూడనట్లు వదిలేసి..

నగరంలో దేవీచౌక్, మెయిన్ రోడ్డు, జాంపేట, గోరక్షణపేట, అప్సరా థియేటర్ రోడ్డు, కోటగుమ్మం, డీలక్స్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. దీంట్లో రాజకీయ జోక్యం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. జాంపేట వద్ద కొన్ని దుకాణాల నిర్వహణపై నెలవారీ మామూళ్లకు అలవాటు పడిన యంత్రాంగం వాటిని చూసీచూడనట్లు వదిలేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పెద్ద దుకాణాల విషయంలో భారీగానే ఆ ప్రాంత నేతలూ మామూళ్లు పిండేసినట్లు తెలుస్తోంది. రానున్న పుష్కరాల నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తు కార్యాచరణ దిశగా అడుగులు వేస్తుంటే ఆదిలోనే హంస పాదు అన్నట్లు పరిస్థితి మారిపోయింది.

ఎంపీకి క్రియాశీల సభ్యత్వం

దేవీచౌక్: భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు శుక్రవారం క్రియాశీల సభ్యత్వం అందజేశారు. క్రియాశీల సభ్యత్వ కార్యక్రమంలో భాగంగా స్థానిక పదో డివిజన్ 166వ పోలింగ్ బూత్‌లో 100 సభ్యత్వాలు పైబడి సాధారణ సభ్యత్వాలు చేసిన కార్యకర్తలకు క్రియాశీల సభ్యత్వాలు అందజేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ జిల్లా ప్రజానీకం తనను అక్కున చేర్చుకుని పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నుకున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వంద ప్రాథమిక సభ్యత్వాలు పూర్తి చేసేందుకు సహకరించిన బూత్ కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆక్రమణల తొలగింపు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: పుష్కరాల నేపథ్యంలో రోడ్డు విస్తరణలో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ ప్రణాళికా విభాగం యంత్రాంగం మున్సిపల్ స్టేడియం రోడ్డులో ఆక్రమణలు తొలగించే ప్రక్రియ చేపట్టింది.

ఆర్డీవోను కలిసిన ఎమ్మెల్యే

టి.నగర్: రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.కృష్ణ నాయక్‌ను శుక్రవారం రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పోలీసుల సేవలు వెలకట్టలేనివి

కడియం, న్యూస్‌టుడే: పోలీసుల సేవలు వెలకట్టలేనివని పీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్‌ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడియం పోలీసు స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సీఐ అల్లు వెంకటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. డా.ఎంవీఆర్ మూర్తి, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, తదితరులు పాల్గొన్నారు.

పాదచారుడికి గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: బొగ్గుల దిబ్బ ప్రాంతానికి చెందిన ఎన్.రాజశేఖర్ గురువారం రాత్రి ఆల్కాట్‌తోట సమీపంలో నడుచుకుంటూ రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి వర్గాలు రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

ద్విచక్ర వాహనం ఢీ కొని

నారాయణపురం ప్రాంతానికి చెందిన ఎన్.రాజు తన ద్విచక్ర వాహనంపై శుక్రవారం ఉదయం జేఎన్ రోడ్డులో వెళ్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు ప్రకాశంనగర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాయి

వీధి మలుపులే చెత్త కుండీలు!





ఇదీ నగరంలో పలుచోట్ల పరిస్థితి. పారిశుద్ధ్య కార్మికుల కష్టానికి ఫలితం లేకుండా పోతోంది. చెత్తవేయరాదు అని ఫ్లెక్సీలు పెట్టిన చోటునే డస్ట్ బిన్‌గా మార్చేస్తున్నారు. వీధుల్లోకి గతంలో మాదిరి పూర్తిస్థాయిలో చెత్త వాహనాలు రాకపోవడం సమస్య తీవ్రత పెంచుతోంది. దీంతో వీధి చివర కనిపించే ప్రదేశాలను స్థానికులు ఇలా వ్యర్థాలతో నింపేస్తున్నారు. కోటిపల్లి బస్టాండ్, ఇన్నీసుపేట పరిసర ప్రాంతాల్లోని వీధుల్లో కనిపించిన పరిస్థితి ఇది. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పలుకు సంస్థకు ఆర్థిక సాయం

కడియం, న్యూస్‌టుడే: సమాజహితానికి పాటుపడటం వ్యక్తిత్వ గుర్తింపునిస్తుందని పలుకు సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ సూచించారు. టీవీసీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి చేస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. రాజమహేంద్రవరం స్వరాజ్ నగర్‌లోని పలుకు- సంకల్పం సేవా సంస్థను ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. అక్కడి మూగ, చెవిటి విద్యార్థులకు తన వంతు సాయంగా రూ. 51,116ను చక్రవర్తి నిర్వాహకులకు అందించారు. మానవతా దృక్పథంతో వీరిని ఆదుకునేందుకు మరింత మంది ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? ఇలా ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట మధ్య

80089 02897
83282 39927

మూడు రోజులకే మళ్లీ కుంగింది!



కోటిపల్లి బస్టాండ్ వద్ద బస్సులు బయటకు వచ్చే మార్గంలో మ్యాన్‌హోల్ మూత ఇది. వారం క్రితం 'ఈనాడు'లో ప్రచురించిన చిత్ర వార్తపై నగరపాలక సంస్థ యంత్రాంగం స్పందించి మరమ్మతులు చేపట్టింది. బాగుచేసిన మూడు రోజులకే తిరిగి మ్యాన్‌హోల్ మూత కుంగిపోయింది. శాశ్వత ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

మూతవేయడానికి ఇంకెన్ని రోజులు?



టి.నగర్‌లోని చల్లా రెసిడెన్సీ రోడ్డులో పదిహేను రోజుల నుంచి మూత లేకుండా ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ భయాందోళనకు గురిచేస్తోంది. నిత్యం వాహనాలు, పాదచారులతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి కావడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. పాదచారులు ఎక్కువగా సంచరించే ఈ ప్రాంతంలో డ్రైనేజీపై మూతలు లేకపోవడం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కూడా నిండిపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు తక్షణమే స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి



విద్యార్థికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న నారాయణ

నృత్య పోటీల్లో ప్రతిభ

అనపర్తి గ్రామీణం: రాజమహేంద్రవరంలో జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య పోటీల్లో అనపర్తి జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని భువనప్రియ మొదటి స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి తెలిపారు. జిల్లా ఉపవిద్యాశాఖాధికారి నారాయణ ప్రశంసాపత్రం అందించారని ఆమె పేర్కొన్నారు.

అన్న సమారాధన

గోకవరం: వీరలక్ష్మి గడ్డలో కొలువైన దుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. దసరా ఉత్సవాల ముగింపులో భాగంగా గడ్డ కమిటీ, ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు కంచాల శ్రీనివాసరావు సమకూర్చిన రూ.1.70 లక్షలతో భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

22న రాజానగరంలో జాబ్ మేళా

రాజానగరం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న రాజానగరంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.సుధాకర్ పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలతో ఆసక్తిగల అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా



సమస్య: కోరుకొండ శివాలయానికి వెళ్లే రహదారిలో రామాలయం ఎదురుగా సిమెంటు రోడ్డు మలుపు వద్ద గొయ్యి తవ్వి వదిలేశారు. వాహన చోదకులు మలుపు తిప్పేటప్పుడు ప్రమాదం జరుగుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

-కె.నాని, గ్రామస్థుడు

సమాధానం: సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

- రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, కోరుకొండ

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

సర్కారు బడిలో తెలుగు చెప్పేవారెవరు..!



సీతానగరం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు

సీతానగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులు లేకుండానే బోధన కొనసాగుతోంది. దీంతో ఏటా తెలుగు ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల నుంచి ఇంటికొచ్చిన పిల్లలు కనీసం తెలుగు కూడా చదవలేని స్థితిలో ఉన్నారంటూ వాపోతున్నారు. సీతానగరంలోని పువ్వాడ సత్యమాంబ స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10 వరకు 370 మంది బాలబాలికలు చదువుతున్నారు. ఇక్కడ 17 మంది ఉపాధ్యాయులకు గానూ 12 మంది పనిచేస్తున్నారు. ముగ్గురు తెలుగు ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉండగా రెండేళ్లుగా వీరిని భర్తీ చేయడం లేదు. ఏటా అయిదు నుంచి పది మంది విద్యార్థులు తెలుగు సబ్జెక్టులో ఫెయిల్ అవుతున్నారు. మిగతా సబ్జెక్టు ఉపాధ్యాయులు అప్పుడప్పుడు తెలుగు బోధిస్తున్నా వారికి అదనపు భారంగా మారడం వారి సబ్జెక్టుకు సమయం సరిపోవడం లేదంటున్నారు.

కోరుకొండలోనూ ఇదే పరిస్థితి..

కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యధికంగా 953 మంది విద్యార్థులుంటే 34 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంది. కానీ 13 మంది ఉపాధ్యాయులు లేరు. తెలుగు ఉపాధ్యాయులను ముగ్గురిని ఇక్కడ భర్తీ చేయాల్సి ఉంది. అయినా వారెవరూ లేకుండానే తెలుగు పాఠాలు కొనసాగడం గమనార్హం. మండలంలోని రామచంద్రపురం, కూనవరం ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఇదే పరిస్థితి. రెండేళ్లుగా తెలుగు ఉపాధ్యాయుల భర్తీపై ప్రధానోపాధ్యాయులంతా నివేదికలు పంపుతున్నా బుట్టదాఖలు చేస్తూనే ఉన్నారంటున్నారు. తమ పిల్లల భవిష్యత్తు నిర్ణయించే పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులు లేకపోవడంతో తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా విద్యాశాఖాధికారితో చర్చించాం..

తెలుగు ఉపాధ్యాయుల కొరత సీతానగరం, కోరుకొండ మండలాల్లోని పలు పాఠశాలల్లో ఉంది. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి సమక్షంలో చర్చించాం. వేరే పాఠశాలల నుంచి వారానికి మూడురోజులు ఆయా పాఠశాలల్లో సర్దుబాటు చేసేలా నిర్ణయం తీసుకున్నాం.

- ఇ.నారాయణ, జిల్లా ఉప విద్యాశాఖాధికారి

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి పెద్దపీట

కడియం, న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెదేపా రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకుల ద్వారా రాయితీ రుణాల మంజూరుపై వీవోఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీఎం ప్రోగ్రాం అధికారి శ్రీవాణి, కడియం శాఖ యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుభాష్, జేగురుపాడు కెనరా బ్యాంకు మేనేజర్ ప్రభాకర్, డీఆర్డీఏ మాదిరి, డీపీఎం హేమంత్, ఏపీఎం అప్పలకొండ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: ఆహార శుద్ధిరంగంలో ఉపాధి కల్పనే లక్ష్యంగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించినట్లు డీఆర్డీఏ (సెర్ప్) డీపీఎం వి.హేమంత్ అన్నారు. సీతానగరంలోని మహిళాశక్తి భవనంలో ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌పై మహిళలకు శిక్షణ నిర్వహించారు. ఏపీఎం జీలానీ, సీసీలు లక్ష్మి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

రంగంపేట, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు శ్రీ ఫౌండేషన్ ట్రస్టు శుక్రవారం రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రోత్సాహకాలను అందించింది. 2023-24లో మండల స్థాయి పదో తరగతి ఫలితాల్లో బి.వాసు (రంగంపేట), డి.రమ్య (జి.దొంతమూరు), డి.హారిక (రంగంపేట)లకు ట్రస్టు ఛైర్మన్ కర్రి శ్రీను, ప్రధానోపాధ్యాయురాలు వి.సాగరాదేవి, ఉపసర్పంచి దుర్గారావు ప్రోత్సాహక బహుమతులను అందించి అభినందించారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ధవళేశ్వరం: బొమ్మూరు 220 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శని, ఆదివారాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నక్కపల్లి శ్యామ్యూల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మూరు నుంచి కొండగుంటూరు వరకు ఫ్లాండర్ కండక్టరు మార్చే పనుల నిమిత్తం 11 కేవీ బొమ్మూరు, కాటన్ ఫీడర్ పరిధిలో పాత బొమ్మూరు, మురళీకొండ, జీపీఆర్ రోడ్డు, ఏపీజీ వెనుక ప్రాంతాల్లో రెండు రోజులూ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దీపావళి నుంచి రుచికరమైన భోజనం



మధ్యాహ్న భోజన పట్టికను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో నారాయణ

సీతానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో దీపావళి నుంచి మధ్యాహ్న భోజన పథకం మెనూ మారుతోందని, మార్గదర్శకాలు అనుసరించి పోషకాహారం ఉండాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఇ.నారాయణ తెలిపారు. సీతానగరం మండలం చినకొండేపూడి జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు సామవేదం ఉషారాణి, విజయకుమార్, శ్రీలక్ష్మి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు వెలకట్టలేనివి



సీఐ వెంకటేశ్వరరావుకు వైద్య పరీక్షలు చేస్తున్న పీఎంపీ సంఘ సభ్యులు

కడియం, న్యూస్‌టుడే: పోలీసుల సేవలు వెలకట్టలేనివని పీఎంపీ రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కమ్యూనిటీ పారామెడికల్ ప్రైమరీ హెల్త్‌ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడియం పోలీసుస్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక సీఐ అల్లు వెంకటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించారు. డా.ఎం.వీఆర్ మూర్తి, జిల్లా కార్యదర్శి వి.దేవానందం, అబ్దుల్ రహమాన్ ఖాన్, మట్ట రమేష్, ప్రసాద్, రామరాజు, సత్యనారాయణ, రాము, భవాని తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై మహిళల నిరసన



దుకాణం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రశాంతినగర్ వాసులు

దానవాయి పేట(రాజమహేంద్రవరం): జనావాసాల మధ్య మద్యం దుకాణం నిర్వహిస్తూ తమను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని బొమ్మూరు పంచాయతీ పరిధి ప్రశాంతినగర్‌లోని మహిళలు శుక్రవారం నిరసనకు దిగారు. బొమ్మూరు కూడలి దోసాలమ్మ ఆలయం వెనక చెరువు గట్టుపై ప్రశాంతినగర్‌లోని గ్రామ సముదాయాల వద్ద ఓ ప్రైవేటు మద్యం దుకాణం నిర్వహిస్తున్నారు. కలెక్టర్, పంచాయతీ, పోలీసు అధికారులకు అప్పట్లోనే విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. మద్యం సీసాలు రోడ్లపై పగల గొట్టడం, నివాసాల వద్ద విసిరేయడం, ఇళ్ల బయట వస్తువులను చోరీ చేయడం చేస్తున్నారని మహిళలు వాపోయారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

గోకవరం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలలో రంపయర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభతో రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు గండం ప్రమీలారాణి తెలిపారు. అండర్-17 విభాగం వాలీబాల్‌లో పదో తరగతి విద్యార్థి పి.అనిల్‌కుమార్, అండర్-14 కబడ్డీలో తొమ్మిదో తరగతి విద్యార్థి బి.మనోహర్ రాష్ట్ర జట్టుకు ఎంపికవగా శుక్రవారం వారితో పాటు శిక్షణ ఇచ్చిన పీడీ విజయకుమారిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నరాజు, ప్రసాద్, నారాయణ, ఆంజనేయులు, నాగభూషణం, రాంబాబు, వరలక్ష్మి, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

రంగంపేట: భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం వచ్చే రైతులను కుటుంబ సభ్యుల్లా భావించి వారికి న్యాయం చేయాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. శుక్రవారం రంగంపేట మండలం ఎస్.టి.రాజాపురంలో రెవెన్యూ గ్రామసభలను తహసీల్దారు ఉండవిల్లి రంజిత్‌కుమార్ ప్రారంభించారు. ఈ సమావేశానికి హాజరైన జేసీ స్థానిక రైతులతో చర్చించి అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దరఖాస్తులపై తహసీల్దారు రంజిత్‌కుమార్, జిల్లా సర్వేయరు లక్ష్మీనారాయణతో ఆయన సమీక్షించారు.

'పలుకు' సంస్థకు ఆర్థిక సాయం

కడియం, న్యూస్‌టుడే: సమాజహితానికి పాటుపడటం ప్రతిఒక్కరి కర్తవ్యమని గుర్తించుకోవాలని పలుకు సంస్థ వ్యవస్థాపకుడు సత్యనారాయణ సూచించారు. టీటీడీ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని అన్నారు. రాజమహేంద్రవరం స్వరాజ్ నగర్‌లోని పలుకు- సంకల్పం సేవా సంస్థను ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. అక్కడి మూగ, చెవిటి విద్యార్థులకు తన వంతు సాయంగా రూ.51,116ను చక్రవర్తి నిర్వాహకులకు అందించారు. మానవతా దృక్పథంతో వీరిని ఆదుకునేందుకు మరింత మంది ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

లేఅవుట్‌లో రోడ్ల ధ్వంసానికి యత్నం

బిక్కవోలు, న్యూస్‌టుడే: కొమరిపాలెం గ్రామానికి చెందిన శ్రీ వసుధా ఎవెన్యూస్ లేఅవుట్ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు చోరీ చేసి, లేఅవుట్‌లోని రోడ్లు ధ్వంసం చేయటానికి ప్రయత్నించారని బిక్కవోలు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ లేఅవుట్ భాగస్వామి కొవ్వూరి వెంకట రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రవి చంద్ర కుమార్ తెలిపారు. గతంలో ఉన్న విభేదాలు, కేసుల కారణంగా కొంతకాలం పనులు నిలుపుదల చేశామని, తిరిగి ఈ నెల 15న పనులు ప్రారంభిస్తే ఈ చర్యలకు దిగారని ఫిర్యాదులో పేర్కొన్నట్టు ఎస్సై వివరించారు. పడాల వెంకటరామారెడ్డి, నేకూరి సత్యనారాయణతో కలిపి మరో నలుగురిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

స్వామీ.. క్షమించు..!



పొన్నచెట్టు దీపారాధన గట్టుపై తాగి పాడేసిన ప్లాస్టిక్ గ్లాసులు

కోరుకొండ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానం ఆవరణలో అపరిశుభ్ర వాతావరణంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పెళ్లిళ్లు జరుపుకొనేందుకు నిర్వాహకులకు అనుమతి ఇస్తున్నారు. ఇదే సమయంలో అక్కడే విందు ఏర్పాటు చేస్తుండటంతో ఆవరణ అపరిశుభ్రంగా మారుతోంది. తాజాగా జరిగిన ఒక వేడుకలో తాగి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు పొన్న చెట్టు దీపారాధన గట్టుపై వేయడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ ఆవరణ ఇలా అపవిత్రం చేస్తున్నారని మండిపడుతున్నారు.

– న్యూస్‌టుడే, కోరుకొండ

సభ్యత్వ నమోదులో రాజానగరం ప్రథమం

రాజానగరం: భాజపా సభ్యత్వ నమోదులో తూర్పు గోదావరి జిల్లాలో రాజానగరం మండలం అత్యధిక సభ్యత్వాలు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందుకు కృషి చేసిన భాజపా మండల శాఖ అధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజును రాష్ట్ర భాజపా అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సిద్దార్థనాథ్ సింగ్ అభినందించి క్రియాశీలక సభ్యత నమోదు దరఖాస్తు పుస్తకాలను అందజేశారు. శివనాగరాజును భాజపా జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అడబాల గణపతిరావు, మండలంలోని పలువురు పార్టీ నాయకులు అభినందించారు.



దరఖాస్తు పుస్తకాలను అందజేస్తున్న పురందేశ్వరి, సిద్దార్థనాథ్ సింగ్



భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



శ్రీరంగపట్నం రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, అనపర్తి గ్రామీణం, కడియం, సీతానగరం, బిక్కవోలు, హుకుంపేట, రాజానగరం: భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తోందని ఆయా మండలాల తహసీల్దార్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయాల్లో గ్రామ సభలను నిర్వహించారు. సమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండలాల్లో నిర్వహించే గ్రామ సభల వివరాలను కార్యక్రమంలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ దోపిడీ, భూముల అవకతవకలు, అడంగల్ లోపాలను ప్రజలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.



పరిసరాల శుభ్రతను పాటించాలి

కడియం, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధుల నుంచి బయటపడేందుకు పరిసరాల శుభ్రత తప్పనిసరిగా పాటించాలని మండల తెదేపా అధ్యక్షుడు, ఉపసర్పంచి వెలుగుబంటి రఘురామ్ అన్నారు. కడియంలో శుక్రవారం దోమల వల్ల కలిగే మలేరియా ఇతరత్రా వ్యాధులు సంక్రమించకుండా ముందస్తు చర్యలుగా స్థానిక నీటి మడుగుల్లో గంబూషియా చేపలను ఆర్యోగ సిబ్బందితో కలిసి వదిలారు. లార్వాదశలో తినడం వల్ల దోమల సంతతిని నివారించవచ్చన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి రామకృష్ణ, సిబ్బంది మురళి, విల్సన్, కె.మూర్తి, కుందన, సునీత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


బాలిక అదృశ్యంపై కేసు

రంగంపేట: మండలంలో 16 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్టు ఎస్సై తోట కృష్ణసాయి తెలిపారు. రాజమహేంద్ర నగరానికి చెందిన బాలిక మండలంలోని అమ్మమ్మ ఇంటికి గురువారం వచ్చారు. తిరిగి నగరానికి బయలుదేరగా అదృశ్యమైనట్టు తల్లి రంగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జూద శిబిరాలపై దాడులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామ శివారులో జూదం ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 7,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని అన్నారు.





కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: గ్రామాల్లో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించడానికి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ శాఖ డీఈ పి.శ్రీధర్ తెలిపారు. ఉండ్రాజవరం తదితర గ్రామాల్లో శుక్రవారం ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. జేఈ హరికృష్ణ, ఏఈలు కనకరాజు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ

గోపాలపురం, దేవరపల్లి: వార్షిక తనిఖీల్లో భాగంగా డీఈవో వాసుదేవరావు శుక్రవారం గోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకం మెనూను పరిశీలించారు. పాఠశాల జాతీయ రహదారి ఆనుకుని ఉండడంతో విద్యార్థులు నడిచి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

పాపన్నగౌడ్ విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత సూచనల మేరకు మండలంలోని తాడిపర్రులో సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు పనులను శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ పి.ప్రసాద్, ఎంపీడీవో వి.రామారావు, ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అధికారుల సమక్షంలో స్థలాన్ని పరిశీలించారు. ఆ వర్గీయుల ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు, దిమ్మ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.



పనులపై సూచనలు చేస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: నల్లజర్ల ప్రధాన కూడలిలో ఉన్న ఒక హోటల్ నుంచి మురుగు బయటకొచ్చి రహదారి పక్కన నిలిచి పోతోంది. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతుంది. సమస్యను పరిష్కరించాలి. - స్థానికుడు, నల్లజర్ల



సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

- న్యూస్‌టుడే, నల్లజర్ల — శ్రీరామచంద్రమూర్తి, పంచాయతీ కార్యదర్శి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497 నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

రహదారికి మరమ్మతులు

ఈనాడు స్పందన

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం గోపవరం వద్ద రహదారిపై పడిన భారీ గుంతకు అధికారులు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. నిడదవోలు మండలం గోపవరం నుంచి డి.ముప్పవరం, నిడదవోలు నుంచి రాజమహేంద్రవరం వెళ్లే రహదారిలో గోపవరం వద్ద రహదారిపై భారీ గుంతపడింది. ఈ కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గత నెల 30న 'ఈనాడు'లో 'కాలువ కాదు... ప్రధాన రహదారే..' శీర్షిక ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేశారు.

ఇసుక సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలి

చాగల్లు: ఇసుక సరఫరా విధానంలో ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. మండలంలోని వాడపల్లి ఇసుక ర్యాంపులో సరఫరాను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఇసుక, మట్టి వంటి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరన్నారు. ప్రతి రీచ్ సమీపంలోని సచివాలయంలో ఇసుక రవాణా ఛార్జీ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. బోట్స్‌మెన్ సొసైటీలు ఇసుక లోడింగ్ ఛార్జీలు వెంటనే చెల్లించాలన్నారు. కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత, పలుశాఖల అధికారులు ఆమె వెంట ఉన్నారు.



విద్యుత్తు ఆదా.. ఇలాగేనా..?

ప్రభుత్వ కార్యాలయాల్లో భోజన విరామ సమయంలోనైనా పంకాలు, దీపాలు ఆర్పివేస్తే కొంతలో కొంతైనా విద్యుత్తు ఆదా చేయడానికి వీలవుతుంది. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. కొవ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది భోజన విరామ సమయంలో పంకాలు, దీపాలు వదిలేసి ఎవరికి వారు వెళ్లిపోయారు. కనీసం ఒక్కరైనా విద్యుత్తు ఆదా దిశగా ఆలోచించకపోవడం విమర్శలకు తావిస్తుంది. ఇకనైనా అధికారులు పర్యవేక్షించి విద్యుత్తు ఆదాకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, చాగల్లు

వందల్లో పట్టాలు.. పదుల్లో నిర్మాణాలు

ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామంటూ వైకాపా నాయకులు ఊదరగొట్టారు. జగనన్న కాలనీల పేరుతో ఊరికి దూరంగా ఉన్న భూములను కొనుగోలు చేసి లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. తీరా అక్కడకు వెళితే సరైన వసతులు లేవు. దీంతో వందల్లో పట్టాలిచ్చినా.. పదుల సంఖ్యలో మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని చోట్ల అసలు నిర్మాణాలే మొదలుకాలేదు. ఇన్ని సమస్యలున్న లేఅవుట్లలో నిర్మాణాల లక్ష్యం పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకుని ముందుకు వెళ్తున్నారు. -న్యూస్‌టుడే, తాళ్లపూడి

★ అంతంత మాత్రంగానే వసతులు

★ లక్ష్య ప్రణాళికతో అధికారుల ముందడుగు



కుంగిన మట్టి రహదారిపై చేరిన నీరు

తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట లేఅవుట్‌లో సుమారు ఏడు గ్రామాలకు చెందిన 857 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. సుమారు 5 కి.మీ. దూరంగా ఉన్నవారికి కూడా పట్టాలిచ్చారు. ఆ సమయంలో లబ్ధిదారుల అభిప్రాయాలు వ్యక్తం చేసినా వైకాపా నాయకులు పట్టించుకోలేదు. సొంత ఊరిలోనే స్థలాలు ఇవ్వాలని కోరినా, అక్కడకు వెళ్లేందుకు ఇష్టం లేదని చెప్పినా అప్పటి అధికారులు పట్టించుకోలేదు. నాసిరకంగా మట్టి రహదారులు నిర్మించారు. వర్షం వస్తే లేఅవుట్లు, రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. నిర్మాణ సామగ్రి తీసుకెళ్లే వాహనాలు సైతం ముందుకెళ్లక కష్టమవుతోంది. మురుగు పారేందుకు డ్రైనేజీ సౌకర్యం కల్పించలేదు. తాగునీటి పైపులైను ఏర్పాటు చేశారు. మెరక పల్లంగా ఉండడంతో నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తాగునీటి పైపులు, కుళాయిలు నాసిరకంగా ఏర్పాటు చేయడంతో విరిగిపోయి ఊడిపోవడం, పగిలిపోవడంతో లీకులు ఏర్పడుతున్నాయి. నీరు నిల్వ చేసుకునే ట్యాంకులు లేవు. లేఅవుట్ వెళ్లేందుకు దారి రహదారులు గోతులమయంగా మారాయి. లేఅవుట్ ఎంపికలో వైకాపా నాయకుల ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. మరో రెండు చోట్ల ఇదే పరిస్థితితో అరకొరగా నిర్మాణాలు జరగక...మిగిలిన మూడు చోట్ల పెండింగ్‌లో ఉన్నాయి.



తాగునీటి కొళాయి ఇలా

ఇదీ లేఅవుట్ పరిస్థితి..

మొత్తం పట్టాలిచ్చిన లబ్ధిదారులు	857
నిర్మాణాలు పూర్తయినవి	92
శ్లాబ్ దశలో	17
గోడల దశలో	31
పునాది స్థాయి	136
నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు	581

డిసెంబరు నాటికి పూర్తి చేసేలా చర్యలు..

ఇళ్లను డిసెంబరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. లబ్ధిదారుల నుంచి ఇళ్ల పూర్తికి ఉన్న సమస్యలను తెలుసుకుంటున్నాం. 100 రోజుల ప్లానింగ్ అమలు చేస్తాం. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తాం. పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖర్, ఈఈ, గృహనిర్మాణ శాఖ

ఆయిల్‌పాంలో తెగుళ్ల నివారణపై శిక్షణ

నల్లజర్ల, న్యూస్‌టుడే: మండలంలోని అయ్యవరంలో ఆయిల్‌పాం తోటలకు వచ్చే తెగుళ్ల నివారణ చర్యలపై రైతులు, రైతు సేవ సిబ్బందికి, త్రీఎఫ్ ఆయిల్‌పాం సంస్థ ప్రతినిధులకు మండల ఉద్యాన అధికారిణి బబిత శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆగస్టు నెల నుంచి విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా తడిగుండ తెగులు సోకిందని, ఈ తెగులు సోకిన చెట్టు కింద ఆకులకు మచ్చలు ఏర్పడి కుళ్లిపోతాయన్నారు. తర్వాత మిగతా ఆకులకు వ్యాపించి ఎండిపోయి చనిపోతాయన్నారు. తరువాత కాండంలోకి వ్యాపించి చెట్టు చనిపోతుందన్నారు. దీని నివారణకు ప్రాథమిక దశలో ఆకుపై మచ్చలు, కుళ్లు ఏర్పడినప్పుడు సాఫ్ లేదా కావ్ క్రిమిసంహారక మందును ఒక లీటర్ నీటిలో 1ఎం.ఎల్. కలిపి ఆకులపై పిచికారీ చేయాలన్నారు. కాండానికి వ్యాప్తి చెందినప్పుడు కుళ్లిన భాగాన్ని తొలగించి ఆ ప్రదేశంలో కార్బెండిజం, మోనోక్రోటోపాస్ మిశ్రమం ఫేస్టులా చేసి పూతలో వేయాలన్నారు. చుట్టు పక్కల చెట్లకు బ్లీచింగ్ పౌడర్‌తో నేల కూడా తడిసేలా చేయాలన్నారు. కాండానికి ప్లాంటోమైసిన్ 2 గ్రాములు, ప్రొపికొనజోల్ 5 మి.లీ.తో ఇంజక్షన్లు ఇవ్వడం వల్ల చెట్టు త్వరగా కోలుకుంటుందన్నారు.

భూ సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: భూముల రీ సర్వే సందర్భంగా తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తోందని తహసీల్దార్ రవీంద్రనాథ్ తెలిపారు. మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని జయవరంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో పలు తప్పులు చోటుచేసుకున్నాయని రైతులు తెలిపారు. ఈ గ్రామసభలో 10 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు తెలిపారు. ఈ నెల 18 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు ఈ సభలు జరుగుతాయన్నారు. ఇందులో భాగంగా 19న రాగోలపల్లి, 21 పోచవరం, 22న తాడిపూడి, 23న పైడిమెట్ట, 24న ప్రక్కిలంక, 25న బల్లిపాడు, 26న తిరుగుడుమెట్ట, 28న నల్లమిల్లిపాడు, 29న రావూరుపాడు, నవంబరు 4, 5న తుపాకులగూడెం గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతి, పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లపూడి: అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్ రవీంద్రనాథ్

నల్లజర్ల: రెవెన్యూ గ్రామసభలో వచ్చిన ప్రతి అర్జీకి పరిష్కార మార్గం చూపుతామని ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ శాంతి ప్రియ తెలిపారు. శుక్రవారం పదమర పోడూరు సచివాలయం సభలో ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని సమస్యల పరిష్కారమే గ్రామసభల లక్ష్యమన్నారు. వివిధ సమస్యలను రైతులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 19న సంజీవపురం, 24, 25 తేదీల్లో దూబచర్ల, 28, 29 తేదీల్లో మారెళ్లమూడి గ్రామాల్లో రెవెన్యూ గ్రామ సభలు జరుగుతాయని రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీటీ సర్వేయర్ టి.సత్యనారాయణ, వీఆర్వోలు మధు, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలం కొండగూడేనికి సంబంధించి తహసీల్దార్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఏడు అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేష్, మండల సర్వేయర్ కృష్ణకుమార్, సర్పంచి రాయి అన్నపూర్ణ, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

20న జాతీయ బృందగాన పోటీలు

చాగల్లు: భారత్ వికాస్ పరిషత్ ప్రాంతీయ స్థాయి జాతీయ బృందగాన పోటీలు ఈనెల 20న నిర్వహించనున్నట్లు పరిషత్ రీజనల్ కార్యదర్శి డి.పురుషోత్తమరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పరిమి కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ గ్రామోత్సవం

పెరవలి, న్యూస్‌టుడే: మండలంలోని ఖండవల్లి సంతపేట వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

ఎడిసన్‌కు నివాళి

తాళ్లపూడి: విద్యుత్తు బల్బు రూపకర్త ఎడిసన్ వర్ధంతిని శుక్రవారం రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

నల్లజర్ల: జీలేవిల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న దీప్పరగూడెనికి చెందిన వసంత మధుబాబు దంపతులకు చికిత్స నిమిత్తం అంబేడ్కర్ యూత్ సంఘ సభ్యులు(నల్లజర్ల) రూ.10 వేలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బొండల శ్రీనివాసరావు, గుడే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌కు సత్కారం

నిడదవోలు: డాక్టరేట్ పొందిన యోగా గురువు పొడుగు నరేష్‌ను రామకృష్ణ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో నిడదవోలులో శుక్రవారం మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, తెదేపా పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, భాజపా అధ్యక్షుడు నీలం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్యకు పరిష్కారం చూపాలి

నిడదవోలు: ఎర్రకాలువ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ నిడదవోలు పట్టణ తెదేపా సీనియర్ నాయకుడు సంకబత్తుల శ్రీధర్ రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందించారు. నిడదవోలు మండలం సింగవరం పరిధిలో 8 గేట్లు నిర్మించకపోవడం వల్ల ఏటా 2 వేల ఎకరాల పంట ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారన్నారు. ఎర్ర కాలువకు సంబంధించి రెండుసార్లు సమీక్షించామని, త్వరలో నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు శ్రీధర్ తెలిపారు.

నిబంధనలు పాటించని బాణసంచా వ్యాపారులపై చర్యలు

తాళ్లపూడి, న్యూస్‌టుడే: బాణసంచా విక్రయదారులు తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ రవీంద్రనాథ్ సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం బాణసంచా విక్రయదారులు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26వ తేదీలోగా అనుమతి పొందాలని, పండుగ రోజున ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే విక్రయాలు చేపట్టాలన్నారు. ప్రతి దుకాణానికి మూడు మీటర్ల ఎల్ ఆకారంలో దుకాణం, అగ్నిమాపక సిబ్బంది వెళ్లేలా 6 మీటర్లు దూరం, పొందిన లైసెన్సును ప్రదర్శించాలన్నారు. ప్రతి దుకాణం వద్ద నీరు, ఇసుక తదితర సామగ్రి ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కొవ్వూరు అగ్నిమాపకాధికారి ఏవీఎస్ ఎన్ఎస్ వేణు, హెడ్ కానిస్టేబుల్ భగవాన్, వీఆర్వో సంజీవ్, ఫైర్‌మేన్ ధనుంజయ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

గోపాలపురం, దేవరపల్లి, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఒక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం... గోపాలపురం బీసీ కాలనీకి చెందిన షేక్ షకీర్(29) రెండు నెలల కిందట ఓ ఫైనాన్స్ కంపెనీలో లారీ కొనుగోలు చేశారు. తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో గురువారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య గమనించి చుట్టుపక్కల వారి సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. మృతుడి భార్య షేక్ ముబీనా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ శుక్రవారం తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం: చికిత్స పొందుతూ మృతి

తాళ్లపూడి, న్యూస్‌టుడే: సమస్యలతో మనస్తాపానికి గురై కలుపు నివారణ మందు తాగి, ఆ మైకంలో మెడపై బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. తాళ్లపూడి మండలం రావూరుపాడుకు చెందిన పుప్పాల హర్షగణపతి (32), అతని తండ్రి కనకరాజు కంద వ్యాపారం చేసేవారు. హర్షగణపతికి మూడేళ్ల కిందట వివాహమైంది. ఒక బాబు, ఒక పాప సంతానం. వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు. దీంతో ఈ ఏడాది జనవరిలో ఆటో డ్రైవర్‌గా చేరారు. అది ప్రమాదానికి గురైంది. పది రోజుల కిందట భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో పిల్లలను తీసుకుని ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై గురువారం మధ్యాహ్నం ఇంటి వరండాలో కలుపు నివారణ మందు తాగి ఆ మైకంలో మెడపై బ్లేడుతో కోసుకుని రక్తపుమడుగులో ఉన్న అతన్ని చూసి బంధువులు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ రోజు అర్ధరాత్రి మృతి చెందాడని, ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక, మృతుడి తండ్రి కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణపై కేసు

చాగల్లు: కొవ్వూరులో ద్విచక్ర వాహనం అపహరణపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పట్టణానికి చెందిన వి.రవికుమార్ ఈ నెల 13న ఇంటి ముందు ద్విచక్ర వాహనం నిలిపారు. తర్వాత రోజు ఉదయానికి కనిపించలేదు. పరిసరాల్లో గాలించినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విశ్వం తెలిపారు.



పెరవలిలో శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి దుర్గేష్, నాయకులు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పెరవలి: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొవ్వూరు డివిజన్‌లో 6 పెద్ద రహదారులు నిర్మించనున్నామని, పెరవలిమండలంలో 8 గ్రామాల్లో 12 పనులకు రూ.1.34 కోట్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం రహదారులను పూర్తిగా విస్మరించిందని, చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్నాయన్నారు. జనసేన, తెదేపా మండల శాఖ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి రామకృష్ణ

బాలికల వసతి గృహం సందర్శన

నిడదవోలు: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జూనియర్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ శుక్రవారం సమిశ్రగూడెంలో సాంఘిక సంక్షేమశాఖ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. సదుపాయాలు, వసతి గృహంలో ఉన్న స్థితిగతులు, వంట గది, బాత్‌రూంలను పరిశీలించారు. లీగల్ ఎయిడ్ న్యాయవాదులు ఎస్‌కే జమీల, ఏఎస్ విశ్వనాథ్, ఎ.సతీష్‌కుమార్, ప్రసన్న, ఏఎస్సై ఆర్‌కే గంగాధర్ తదితరులున్నారు.

మంగళగిరి సమావేశంలో...

మంగళగిరి తెదేపా కేంద్ర కార్యాలయంలో తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో శుక్రవారం సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, నిడదవోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, నిడదవోలు



మరమ్మతుకు గురైతే మూలకే..!



చెత్త తరలించే రిక్షాలు మరమ్మతుల బారిన పడితే చాలు.. పట్టించుకోకుండా పక్కన పెట్టేస్తున్నారు. తాళ్లపూడి మండలంలోని వేగేశ్వరపురం సచివాలయం వద్ద ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చెత్తను తరలించే మూడు రిక్షాలు మరమ్మతుల బారిన పడడంతో మూలన పెట్టేశారు. బ్యాటరీతో నడిచే రిక్షా తుప్పుపట్టి పాడైపోయింది. ఎంపీడీవో రమణ దృష్టికి తీసుకెళ్లగా సచివాలయ కార్యదర్శితో మాట్లాడి బాగుచేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దేవరపల్లి, న్యూస్‌టుడే: మండలం దుద్దుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని జి.స్వర్ణకుమారి తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా ఏఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. అండర్-17 విభాగంలో సీహెచ్.హనీ, పి.దినేష్ కార్తీక్, ఎస్.కె.ఉస్మాన్ ఘనీ అర్హత పొందారు. వీరు శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో ఈనెల 21, 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అండర్-14 విభాగంలో పి.హనీ, పి.నవీన్, ఎంపికయ్యారు. వీరు విజయనగరం జిల్లా భోగాపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు, వ్యాయామోపాధ్యాయుడు రామ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు అభినందించారు.



దుద్దుకూరులో ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

చాగల్లు: వాలీబాల్ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు యు.ప్రవీణ్, వై.ప్రమీల ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వి.శ్యామ్‌సన్ తెలిపారు. చాగల్లు మండలం కలవలపల్లి పాఠశాలకు చెందిన పి.లాస్య, కె.తేజ, టి.వెన్నెల అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీఈటీ గంగాధర్ తెలిపారు.

‘హిందూ సమాజాన్ని సంఘటితం చేయాలి’

నల్లజర్ల: హిందూ సమాజాన్ని సంఘటితం చేయాలని విశ్వహిందూ పరిషత్తు అఖిల భారత న్యాయ విభాగం సభ్యుడు జి.శ్యాం ప్రసాద్ ముఖర్జీ పేర్కొన్నారు. ముసళ్లగుంటకు చెందిన ఆరు కుటుంబాలు శుక్రవారం హిందూ ధర్మ పునరాగమనం చేశాయి. హిందూ ధర్మం స్వీకరించిన దంపతులకు జిల్లా విశ్వ హిందూ పరిషత్తు కార్యదర్శి గంగాధర్, జిల్లా గో రక్షక విభాగం కార్యదర్శి సుబ్బారాయుడు పట్టు పంచె, చీర రవిక, భగవద్గీత, వేంకటేశ్వరుని చిత్ర పటం, గంగాజలం అందించారు. అనంతరం హోమం చేశారు. విశ్వహిందూ పరిషత్తు మండలశాఖ అధ్యక్షుడు కందుల రవి, ఉండ్రాజవరపు వెంకటరత్నం, నందమూరి రామకృష్ణ, సవలం రామకృష్ణ, బద్దిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి

నల్లజర్ల: ఎమ్మార్పీఎస్ మండలశాఖ అధ్యక్షుడిగా మర్రి శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా తాడిగడప వెంకట్రావు నియమితులయ్యాయి. ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకటరాజు నుంచి ఉత్తర్వులు అందినట్లు శోభన్‌బాబు తెలిపారు. అచ్చన్నపాలెంలోని ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం వర్గీకరణ అంశానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలన్నారు. త్వరలో ఆయా గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కూనపాము వెంకటరమణ, సువర్ణరాజు, రత్నం, పెనుమాక వెంకటరావు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై మృత్యు కూడళ్లు..!

న్యూస్‌టుడే, పెరవలి

జాతీయ రహదారిలో కొన్ని మలుపులు, కూడళ్లు ప్రమాదకరంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ దుర్ఘటనలు చోటుచేసుకుని కొంతమంది ప్రాణాలు కోల్పోతే.. మరికొందరు అంగవికలురుగా మారుతున్నారు. ప్రమాదాలకు కారణాలను విశ్లేషించి, నివారణ చర్యలు చేపట్టాల్సిన జాతీయ రహదారి అధికారులు సూచికల బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉభయ గోదావరి జిల్లాలో తణుకు పట్టణం మీదుగా పెరవలి మండలం, ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం వరకు పదహారో నంబరు జాతీయ రహదారి రెండు లైన్లలో విస్తరించి ఉంది. పెరవలి మండలంలో 16 కిలోమీటర్ల పొడవున ఉంది. ఈ రహదారిలో పెరవలి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి రవళి స్పిన్నింగు మిల్లు, అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పెద్ద మలుపులున్నాయి. ఇవి కాకుండా పెరవలి వంతెన వద్ద నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నల్లాకులవారిపాలెం-ముక్కామల, రవళి స్పిన్నింగుమిల్లు, అన్నవరప్పాడు, కడింపాడు వద్ద కూడళ్లున్నాయి. ఆయా ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



నల్లాకులవారిపాలెం-ముక్కామల కూడలి

ఈ కూడళ్ల వద్ద గత ఏడాది జరిగిన ప్రమాదాల్లో 11 మంది ప్రాణాలు కోల్పోగా, 22 మంది అంగవికలురుగా మారారు. సరైన వెలుతురు లేకపోవడం వల్లే కూడళ్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించే అవకాశం ఉందని, ఈ దిశగా చర్యలు చేపట్టాలని మొర పెట్టుకుంటున్నా జాతీయరహదారి అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వారు స్పందించాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు దృష్టి పెడితే పరిస్థితి మెరుగుపడుతుందని తద్వారా ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని వారంటున్నారు.



నల్లాకులవారిపాలెం వద్ద ప్రమాదకర మలుపు

సూచికలు ఏర్పాటు చేశాం..

జాతీయ రహదారిలోని మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశాం. ప్రమాదకర కూడళ్లలో సెంట్రల్ లైటింగు లేకపోవడం వాస్తవం. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. - అప్పారావు, ఎస్సై. పెరవలి